క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

కర్నూలు (లీగల్) : జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం.హుసేన్ బాషా పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. జేజేబీ, ఆక్ట్, పోక్సో ఆక్ట్, ప్లీ బార్గేనింగ్, వినియోగదారుల చట్టం, అరెస్టు, ప్రీ అరెస్టు, రిమాండ్ స్టేజ్ తదితర వాటి గురించి పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



రాజ్‌విహార్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్) : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ అంగన్‌వాడీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో 40వ రోజు అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. వీరికి మద్దతుగా సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజ్‌విహార్‌లో మానవహారం నిర్వహించారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ వర్తింపజేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

కర్నూలు(సెంట్రల్) : తక్షణమే వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ వర్తింపజేయాలని బీజేపీ నాయకుడు పార్థసారథి డిమాండ్ చేశారు. శనివారం శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ దీక్షకు దిగారు. ఈ దీక్షకు బీజేపీ నాయకుడు పార్థసారథి, భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే ఆటోలు సీజ్



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ఇంతియాజ్ బాషా

కర్నూలు : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఆటోలు సీజ్ చేస్తామని రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. కర్నూలు కార్పొరేషన్ కార్యాలయం పక్కనున్న ఆటోస్టాండ్ ఆటోడ్రైవర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు నిలపవద్దని హెచ్చరించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు ఆటోలను ఒకటి వెనుక ఒకటి లైన్‌లో క్యూ పద్ధతి పాటించాలని సూచించారు. అలాగే కర్నూలు, తెలంగాణ ఆటోడ్రైవర్ల మధ్య కూడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా క్రమశిక్షణ పాటించాలని, గొడవలు పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాలికలను పరిరక్షించుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆడపిల్లలే ఇంటికి వెలుగు అని, వారిని సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం టౌన్ మోడల్ పాఠశాలలో బాలిక సంరక్షణపై విద్య, వైద్యారోగ్యధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆడ పిల్లలను సంరక్షించుకుంటే భవిష్యత్ బంగారు బాతులాగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు బాలిక సంరక్షణపై వ్యాస, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డెమో ఆఫీసర్లు ప్రమీణాదేవి, చంద్రశేఖరరెడ్డి, ప్రోగ్రామ్ కన్సల్టెంట్ సుమలత, డీసీఈబీ సెక్రటరీ బి.నాగరాజు, సైన్స్ టీచర్లు రాజశేఖర్, స్నేహలత పాల్గొన్నారు.

కులగణన షురూ

కర్నూలు (టౌన్) : నగరంలో శనివారం కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయాల సిబ్బంది తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి వారి వారి కుటుంబాల వివరాలను సమగ్రంగా సేకరిస్తున్నారు. కుటుంబంలోని ప్రతి వ్యక్తి పేరు, ఆధార్ నంబర్, అడ్రస్, పంచాయతీ, మండలం, జిల్లా పేర్లను తీసుకుంటున్నారు. అలాగే ఆ సభ్యుడు ఉండే కుటుంబంలో సభ్యుల సంఖ్య, వారు నివాస ఉండే ఇంటి వివరాలు, వారికి పశువులు ఉంటే వాటి సంఖ్య, ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ వాడుతున్నారా లేదా కట్టెల పొయ్యి వినియోగంలో ఉందా? కులం, చదువు, వృత్తి, వారికి ఉన్న భూముల వివరాలను తీసుకుంటున్నారు. సర్వే సిబ్బందికి నగరపాలక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తున్నారు. 10 రోజుల వ్యవధిలో కులగణన పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరంలో సర్వే ముమ్మరం చేసినట్లు నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ తెలిపారు. ప్రతి ఒక్కరు విధిగా సర్వేలో పాల్గొని వివరాలు తెలియజేయాలని చెప్పారు. కులగణనతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలన్నారు.



స్వామిరెడ్డినగర్‌లో కులగణన సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది



లక్ష్మీనగర్‌లో కుటుంబ వివరాలు సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

పక్కాగా కులగణన నిర్వహించాలి

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కుల గణనను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ రమణమూర్తి సచివాలయ ఉద్యోగులకు సూచించారు.మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న కుల గణన సర్వేను శనివారం ఆయన పర్యవేక్షించారు. వివిధ గ్రామాల్లో 949 కుంటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి వివరాలు నమోదు చేయాలని సర్వే సిబ్బందిని ఆదేశించారు.

ఈ-కోర్టుపై అవగాహన



కంప్యూటర్ వాడకం గురించి వివరిస్తున్న జడ్జి భూపాల్‌రెడ్డి

కర్నూలు (లీగల్): ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి న్యాయవాది, న్యాయవాద గుమాస్తాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఏడో అదనపు జిల్లా జడ్జి జి.భూపాల్‌రెడ్డి అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టులో న్యాయవాదులకు, న్యాయవాద గుమాస్తాలకు ఈ-కోర్టు అంశంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు కంప్యూటర్, ఇంటర్‌నెట్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటి వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని చెప్పారు. అదే సమయంలో వాటి వినియోగంలో జాగ్రత్తలు కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో పేపర్ వాడకం తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు, సీనియర్ న్యాయవాదులు జోగయ్య శర్మ, నాగలక్ష్మీ దేవి, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్‌వైజర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని సెక్యూరిటీ సిబ్బందిపై చాలా ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలాంటివి మళ్లీ పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలోని రోగులకు సహాయకులుగా కొంత మంది సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందికి డ్యూటీ రోస్టర్ వేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలోని సెక్యూరిటీ, శానిటేషన్ ఏజెన్సీలు సక్రమంగా విధులు నిర్వహించకపోతే వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది హాజరును పర్యవేక్షిస్తామన్నారు. ఎవ్వరైనా సరిగ్గా పనిచేయకపోతే వారికి మెమోలు జారీ చేయాలని ఆర్‌ఎంఓలకు ఆదేశించారు. సమావేశంలో సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివ బాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఖాజీ కార్యాలయం ప్రారంభం



ఖాజీ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక విద్యానగర్ మాంటిస్సోరి స్కూల్ సమీపంలో ప్రభుత్వ ఖాజీ కార్యాలయం శనివారం సాయంత్రం ప్రారంభమైంది. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, అమీర్ షరియత్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన హజ్రత్ మౌలానా షా మహమ్మద్ జమలూర్ రెహమాన్ సాహెబ్ దామద్ బర్కత్, ముఫ్తీ మహమ్మద్ ఇనాముల్ హక్ ఖాస్మి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూలు కేంద్రంగా ప్రభుత్వ ఖాజీ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. న్యాయబద్ధంగా ప్రభుత్వ చట్టాలను అనుసరించి భార్యాభర్తల సమస్యలను ఖాజీ పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ సుధాకర్, రెండో పట్టణ సీఐ ఇంతియాజ్, న్యాయవాదులు, ముస్లిం మత పెద్దలు జుబేర్ మౌలానా, మజీద్ మౌలానా, జాకీర్ మౌలానా, ముఫ్తి షా వలి, ముఫ్తి ఎజాజ్, అబ్దుల్లా హాఫీ సాబ్, ముఫ్తి సొహైల్, ముఫ్తి అబ్దుల్ రహమాన్, మౌలానా గౌస్, అబ్దుల్ హుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

నేడు రోల్ అబ్జర్వర్ రాక

కర్నూలు(సెంట్రల్) : ఎస్ఎస్ఆర్-2024లో సమీక్ష కోసం రోల్ అబ్జర్వర్ డి.మురళీధర్‌రెడ్డి రానున్నారు. ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికల అధికారులతో నిర్వహించే సమీక్షలో పాల్గొంటారు. 22వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమవుతారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబారు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ డిగ్రీ 3,5 సెమిష్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. శ్రీశైలం డిగ్రీ కాలేజీలో ఒక్కరు, కర్నూలు ఎస్టీబీసీ కాలేజీలో మరొకరు డిబార్ అయ్యారు. కాగా, శనివారం పరీక్షలకు 6,082 మందికి గాను 5,464 మంది హాజరయ్యారు.

ప్రతి గడపకు కేంద్ర పథకాలు

కర్నూలు (న్యూటౌన్): ప్రతి గడపకు కేంద్ర పథకాలతో పాటు భారతీయ జెండాను చేర్చడం బీజేపీ కార్యకర్తల కర్తవ్యం కావాలని ఏపీ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిత్రా వెంకట శివనారాయణ అన్నారు. శనివారం నగరంలోని టీజే కాంప్లెక్స్ ఎదురుగా బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, ఓబీసీ ప్రధాన కార్యదర్శి మురళీనాయుడు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి గీతా మాధురి పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జెండర్ సెన్సిటైజేషన్, లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, నేరాలు పోష్ యాక్ట్ కిందకు వస్తాయని, పనిచేసే ప్రదేశంలో ఎలాంటి ఇన్సిడెంట్స్ జరిగినా కమిటీ/సెల్‌కి తెలియజేయాలన్నారు. నిందితులపై 160 రోజుల లోపు విచారణ చేసి, శిక్షను అమలు చేస్తామన్నారు. తర్వాత లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బాలిక రక్షణ, చదివించే బాధ్యతపై ప్రతిజ్ఞ చేయించారు.

విజయవంతంగా ఫిష్ ఆంధ్ర యూనిట్లు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర రీటైల్ అవుట్‌లెట్స్ విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల తెలిపారు. శనివారం ఈనాడు ప్రధాన సంచికలో 'చేప చుట్టేశారు' పేరుతో ప్రచురితమైన కథనంలో కర్నూలు జలమండలి కార్యాలయం వెనుక ఉన్న ఫిష్ ఆంధ్ర రీటైల్ అవుట్‌లెట్ మూత పడిందని రాశారని, ఇందులో నిజం లేదని తెలిపారు. ఫిష్ ఆంధ్ర యూనిట్ నిర్వాహకుడు ఇంటి నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉండటంతో తాత్కాలికంగా మూశారని పేర్కొన్నారు. వ్యాపారం జరగక మూత పడలేదని స్పష్టం చేశారు. త్వరలోనే ఆ యూనిట్ పునఃప్రారంభమవుతుందని శనివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు నన్నూరులో ఇళ్ల పట్టాల పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామానికి చెందిన పేదలకు సోమవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే ఉద్దేశంతో జాతీయ రహదారికి ఆనుకొని పూడిచెర్ల సమీపంలో 8 ఎక రాల్లో లేఅవుట్ వేసినట్లు పేర్కొన్నారు. అర్హతగల 873 మంది నిరుపేదలకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యేకాటసాని రాంభూపాల్‌రెడ్డి పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

స్త్రీనిధి రుణాలు మంజూరు చేయండి



మెప్మా పీడీకి వినతిపత్రం ఇస్తున్న ఐద్వా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు

కర్నూలు (టౌన్) : స్త్రీనిధి పేరుతో రూ.లక్షలు డిపాజిట్ చేసుకున్న బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం లేదని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి అలివేలు అన్నారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభయ హస్తం కట్టిన సభ్యులకు పెన్షన్, స్కాలర్ షిప్‌లు ఇవ్వడం లేదన్నారు. పొదుపు సంఘాల మహిళలకు వృత్తి పర శిక్షణ ఇచ్చి డ్వాక్రా బజార్లు ఏర్పాటు చేయాలన్నారు. పొదుపు సంఘాలకు సంబంధించిన పుస్తకాలను సంవత్సరానికి ఒకసారి మార్చాలన్న డిమాండ్‌ను రద్దు చేయాలన్నారు. దీనిపై స్పందించిన మెప్మా పీడీ పొదుపు సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి చర్యలు వెంటనే తీసుకుంటానని వెల్లడించారు.

ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీలో నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): అనిమల్ హజ్‌బెండరీ అసిస్టెంట్ (ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీలో నకిలీ సర్టిఫికెట్లను అరికట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏహెచ్‌ఏ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి రాత పరీక్ష నిర్వహించిందన్నారు. కర్నూలు జిల్లాలో 250 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని పొందేందుకు కొందరు పుత్తూరు, నూజివీడు కేంద్రంగా పనిచేస్తున్న భారత సమాజ సేవక్ సంస్థ ద్వారా నకిలీ సర్టిఫికెట్లను రూ. లక్షన్నరకు పొంది ఉద్యోగాలు పొందేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాంటి సర్టిఫికెట్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నకిలీలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, హుస్సేన్, మహబూబ్‌బాషా, శివ, అయ్యన్న, నవీన్, శ్రీహరి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తెలిపారు. గడివేముల మండల పరిధిలోని గని ఉపసర్పంచ్ శివానంద రెడ్డి తండ్రి ఎద్దుల కృష్ణారెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉపసర్పంచ్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని, అన్నివేళలా పార్టీతో పాటు వ్యక్తిగతంగా తాను అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ ఆర్.బీ చంద్ర శేఖర రెడ్డి,ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ కత్తి తులసమ్మ,వైస్ ఎంపీపీ కాలు నాయక్, నాయకులు దస్తగిరి రెడ్డి, మేఘనాథ్ రెడ్డి, గని ప్రతాపరెడ్డి, రఘు మాధవరెడ్డి, నంద్యాల వెంకటేశ్వర్లు,శ్రీధర్, ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య



సల్కాపురం గ్రామంలో 104 వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. శనివారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సల్కాపురం గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేల ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎమ్‌లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో వైద్య సేవలు అవసరమైన వారిని గుర్తించి ఫ్యామిలీ ఫిజిషయన్ సేవల కార్యక్రమానికి తీసుకురావలన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వైరస్ వ్యాధులు ప్రబలకుండా వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తుగ్గలి: బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న జొన్నగిరికి చెందిన కె ప్రసాద్ గతేడాది డిసెంబర్ 27న గుండె పోటుతో మృతి చెందారు. తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు కానరాని లోకాలకు వెళ్లాడని తోటి స్నేహితులు బాధపడ్డారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా కలిసి రూ.35వేలు పోగుచేసి ప్రసాద్ భార్య ఎర్నాథమ్మకు శనివారం అందజేశారు. పది నెలల క్రితం చనిపోయిన ఓ స్నేహితుడి కుటుంబానికి కూడా ఇదే బ్యాచ్ రూ.50 వేలు అందజేసింది. స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న వీరి స్నేహ బంధానికి ప్రశంసలు దక్కుతున్నాయి.



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై తప్పుడు వార్తలు రాస్తున్న ఈనాడు దినపత్రికపై వైఎస్ ఆర్‌సీపీ దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ మద్దయ్య, యాట ఓబులేసు, నవీన్, కేదార్‌నాథ్, డీకే రాజశేఖర్, సూర్యుడు తదితరులు పాల్గొన్నారు. -కర్నూలు (సెంట్రల్)

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి మృతి



మృతిచెందిన షేక్ అస్లాం

కర్నూలు : కర్నూలు-హైదరాబాదు రోడ్డులోని ఆటోనగర్‌కు ఎదురుగా (ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద) జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా చిక్కనహల్లి గ్రామానికి చెందిన షేక్ అస్లాం (27) మృతిచెందారు. బొలెరో వాహనంలో పచ్చి టెంకాయలతో తుముకూరు నుంచి హైదరాబాదుకు వెళ్తుండగా కర్నూలు శివారులో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ పవన్ తెల్లవారుజామున 4:30 గంటల సమయంలో కల్వర్టును ఢీకొట్టడంతో వాహనంలో ఎడమవైపు కూర్చున్న షేక్ అస్లాం తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్యతో పాటు ఒక కూతురు సంతానం. మృతుడి సోదరుడు సయ్యద్ అబ్రార్ ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్ పవన్‌పై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన గొల్ల కృష్ణ (ఫైల్)

కర్నూలు : ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన గొల్ల కృష్ణ (40) అదృశ్యమయ్యాడు. ఈయన కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధ పడుతుండటంతో ఈనెల 9వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ 10వ తేదీ రాత్రి 10:30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లాడు. అతని కోసం కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా కనిపించలేదు. ఆసుపత్రి నుంచి బయటకెళ్లినప్పుడు తెలుపు రంగు చొక్కా, ఆకుపచ్చ పంచ ధరించాడు. తల్లి గొల్ల నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

అవంతి నగర్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు : స్థానిక వెంకటరమణ కాలనీ శివారులోని అవంతి నగర్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కాలనీలోని అవంతి స్కీన్ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నెం .107లో అజయ్‌కుమార్ నివాసముంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కరెంటు పోవడంతో కొవ్వొత్తి వెలిగించి ఫ్రిజ్‌పై పెట్టి పడక గదిలో నిద్రపోయాడు. కొవ్వొత్తి కరిగి ఫ్రిజ్‌కి మంట తాకడంతో ఫ్రిడ్జ్‌కి ఉన్న సిలిండర్ వేడికి పేలిపోయింది. ఫ్రిడ్జ్‌తో పాటు పక్కనున్న వస్తువులు కూడా కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ఫ్రిడ్జ్‌తో పాటు కొన్ని వస్తువులు కాలిపోయాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కొణిదేడుకు చెందిన ఉసేన్‌సా బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో గాయపడిన ద్విచక్రవాహనదారుడిని చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేటు బస్సు



దెబ్బతిన్న ప్రైవేట్ బస్సు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై ఎస్సార్బీసీ కాల్వ వద్ద ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో చందమామ హోటల్ వద్ద బియ్యం బస్తాలతో ట్రాక్టర్ పాణ్యం వైపు వెళ్తుంది. తెలంగాణకు చెందిన టీఎస్08 యూఎల్ 3388 నెంబరు గల ప్రైవేటు ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న వెంకటేశ్వర్లు, సిద్ధం సుబ్బారెడ్డి, సలాంబాషాతో పాటు బస్సు డ్రైవర్ నాగేష్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాలకు తరలించారు. కాగా బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న తర్వాత డివైడర్ ఎక్కి ఎడమ నుంచి కుడి వైపు వెళ్లడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో వేరే వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ అజాగ్రత్తే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఆదోని సెబ్ సీఐ హరిక్రిష్ణ

ఆదోనిరూరల్: పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద సెబ్ అధికారులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ హరిక్రిష్ణ తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తలిస్తున్నారనే సమాచారంతో సెబ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. పట్టణానికి చెందిన బోయ మానస, బోయ వీరేశమ్మలను అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా ఒక్కొక్కరి వద్ద ఆరు బాక్సుల ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బయటపడింది. మొత్తం 12 కర్ణాటక మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (న్యూటౌన్): మున్సిపల్‌టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీఆర్ గోపాల్ రెడ్డి, వి. సురేష్‌కుమార్ జేడీ సర్వీసెస్ పాఠశాల విద్యాశాఖ అధికారి మువ్వారామలింగంను కోరారు. శనివారం కర్నూలులో ఆయనను ఏపీఎంటీఎఫ్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అలాగే పదోన్నతులు, బదిలీల కోసం ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారని తెలియజేశారు.

మద్దిలేటి స్వామి ఒక్క రోజు ఆదాయం రూ.4.26 లక్షలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామి క్షేత్రానికి పుష్య మాసం శనివారం సందర్భంగా రూ. రూ.4.26 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కర్నూలు నగరానికి చెందిన అలవాల బాలయ్య, లక్ష్మీదేవమ్మల జ్ఞాపకార్థం కుమారుడు మురళీ మోహన్ రూ.1,00,101 విరాళంగా అందజేశారు.

బంగారు షాపు యజమాని ఉడాయింపు

ఆదోనిఅర్బన్: పట్టణంలో ఓ బంగారు దుకాణం యజమాని 2 రోజుల నుంచి దుకాణం బంద్ చేసి ఉడాయించినట్లు సమాచారం. బంగారం ఆభరణాల కోసం ఆర్డర్లు ఇచ్చినవారి నుంచి వసూలైన డబ్బు, మరమ్మతుల కోసం వచ్చిన బంగారు ఆభరణాలు తీసుకుని దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇదే విషయాన్ని వన్‌టౌన్ సీఐ తేజమూర్తి దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతుల నిమిత్తం నెక్లెస్ ఇచ్చామని, అతడు దుకాణం మూసేసి వెళ్లాడని ఒకరి నుంచి మాత్రమే ఫిర్యాదు అందిందన్నారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు. కాగా బాధితులు చాలా మంది ఉన్నట్లు సమాచారం.